సాక్షి మహబూబాబాద్

ఆదివారం । 24 । డిసెంబర్ । 2023



వరుస సెలువులు..

నేటి నుంచి మూడు రోజుల పాటు పాఠశాలలకు సెలవులు రావడంతో విద్యార్థులు ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు బయలుదేరుతున్నారు.

- 8లో ▸



రైతులకు న్యాయం చేయాలి

కౌలు రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని తెలంగాణ రైతు సంఘం సలహాదారుడు వెంకటనారాయణ డిమాండ్ చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
$30^0/16^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం మామూలు ఉష్ణోగ్రత ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్



కురవి: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బిలీవర్స్ ఈస్టన్ చర్చిలో కృపానందం అయ్యగారి ఆధ్వర్యంలో నిరుపేద క్రిస్టియన్‌లకు ఉచితంగా దుస్తువులను పంపిణీ చేశారు. అనంతరం కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, పాస్టర్‌లు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల పరిశీలన



కొత్తగూడ: మండలంలోని సాదిరెడ్డిపల్లి బాలుర, కొత్తగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలను ఐటీడీఏ ప్రత్యేక బృందం శనివారం పరిశీలించారు. పాఠశాల విద్యార్థులకు కల్పించిన వసతులు, భోజన నాణ్యత, మెనూ, ఇప్పటి వరకు జరిగిన పాఠ్యాంశాలపై విద్యార్థులకు గల ప్రతిభలను బృందం సభ్యులు పరిశీలించారు. డిజిటల్ తరగతులు జరుగుతున్నాయా లేదా తెలుసుకున్నారు. ఇంకా కావాలిన్న వసతుల గూర్చి ఆరా తీశారు. పూర్తి స్థాయి నివేదికను ఐటీడీఏ పీఓకు సమర్పిస్తామని బృందం కో ఆర్డినేటర్ డీసీఎస్ శర్మ తెలిపారు. ఆయన వెంట వెంకన్న, వీరాసింగ్, అనురాధ, రమణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి




గార్ల: పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్ అధికారి రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని మర్రిగూడెం గ్రామ పంచాయతీలో నూతన పోస్టాఫీస్ కార్యాలయాన్ని ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ సేవలను పంచాయతీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా బుజ్జి రాములు, జెడ్పీటీసీ సభ్యురాలు జాటోత్ ఝాన్సీలక్ష్మి, ఎంపీపీ ఎం.శివాజీచౌహాన్, బి.అమర్‌చంద్, మాలోత్ రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరుగురు ఎస్సైల బదిలీ

మహబూబాబాద్ రూరల్: అందరు ఊహించినట్టుగానే పోలీసు శాఖలో బదిలీల ప్రక్రియ మొదలైంది. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రాం సింగ్ జీ పాటిల్ శనివారం ఆరుగురు ఎస్సైలు, ఒక సీఐని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సదరు అధికారులు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పనిచేసినట్లు సమాచారం. అంతేకాకుండా పోలీసు అధికారులు సార్వత్రిక ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా పనిచేయటం జరిగిందని, ఆ నాయకులతో వారికి ప్రత్యక్ష సంబంధాలు ఉండవచ్చనే ప్రచారం జరుగుతుంది. వీరే కాకుండా జిల్లాలో మరికొంతమంది పోలీసు అధికారులు కూడా త్వరలోనే బదిలీ జరగవచ్చనే ప్రచారం జరుగుతుంది. జిల్లాలో పనిచేస్తున్న ఓ సీఐని ఆకస్మికంగా బదిలీ చేశారు. అందుకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అలాగే కేసముద్రం ఎస్సై కే.తిరుపతిని ఐటీ కోర్ విభాగానికి, రూరల్ ఎస్సై బి.రాంచరణ్‌ను ఎస్పీ కార్యాలయానికి అటాచ్, మరిపెడ ఎస్.హెచ్.ఓ డి.పవన్ కుమార్‌ను హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేశారు. మహబూబాబాద్ టౌన్ రెండవ ఎస్సై వి.దీపికను మహబూబాబాద్ రూరల్‌కు, గూడూరు రెండవ ఎస్సై ఎం.వంశీధర్‌ను కేసముద్రంకు, మరిపెడ రెండవ ఎస్సై ఎస్.జీనత్‌ను మరిపెడ ఎస్సైగా బదిలీ చేశారు.

పార్లమెంట్‌పై గురి!

- మహబూబాబాద్ ఎంపీ సీటు గెలిచేందుకు వ్యూహం
- ఎమ్మెల్యేల గెలుపుతో జోష్‌లో కాంగ్రెస్
- పట్టు సడలకుండా ఉండేందుకు బీఆర్ఎస్ ప్రయత్నం
- మోదీ చరిష్మాతో కమలనాథులు
- మొదలైన పార్లమెంట్ ఎన్నికల సందడి



సాక్షి, మహబూబాబాద్: రెండు నెలల నుంచి రాష్ట్ర శాసనసభ ఎన్నికల బిజీ నెలకొంది. ఎన్నికల ప్రక్రియ పూర్తి, ఫలితాలు వెలువడి ఇప్పుడిప్పుడే పాలన గాడిలో పడుతుంది. ఇంతలోనే మళ్లీ ఎన్నికల సందడి మొదలైంది. ఇప్పటికే అధికారులు పార్లమెంట్ ఎన్నికల నిర్వాహన కోసం కసరత్తు ప్రారంభించారు. మరో మూడు నెలల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో అటు అధికారులకే కాకుండా ఇటు అన్ని రాజకీయ పార్టీలకు కూడా మళ్లీ టాస్క్ మొదలైనట్లే అనే అభిప్రాయానికి వచ్చారు. మహబూబాబాద్ పార్లమెంట్ నిర్వాహనకు కేంద్రంగా మహబూబాబాద్ ఉండటంతో అందరు పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం అవుతున్నారు.

గెలుపు జోష్‌లో కాంగ్రెస్

గడిచిన పది సంవత్సరాలుగా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చారు. ఇందులో భాగంగానే మహబూబాబాద్, వరంగల్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, ఇల్లెందు, పినపాక, భద్రాచలం ఏడు నియోజకవర్గాల్లో భద్రాచలం మినహా ఆరు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలిచారు. ఇదే జోష్‌తో పార్లమెంట్ ఎన్నికల్లో కూడా విజయం సాధించాలనే ఆలోచనతో ఆ పార్టీ ఉంది. ఇందుకు అనుగుణంగానే మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అప్పగించారు. ఏడు నియోజకవర్గాల్లో ములుగు నియోజకవర్గం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క సొంత నియోజకవర్గం కాగా.. నర్సంపేట మినహా ఐదు నియోజకవర్గాల్లో పొంగులేటికి మంచి పట్టు ఉంది. పినపాక, ఇల్లెందు నియోజకవర్గాలు అయితే ఆయన అనుచరులే ఎమ్మెల్యేలుగా గెలిచి ఉన్నారు. అదేవిధంగా మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు ఆయన మద్దతు, ఆర్థిక సహకారం కూడా అందించారు. పొంగులేటి ఇన్‌చార్జ్‌గా పార్లమెంట్ ఎన్నికల్లోకి వెళ్తున్న కాంగ్రెస్‌కి గెలుపు తథ్యమని ఆ పార్టీ నాయకులు ధీమాతో ఉన్నారు.

గెలుపు సాధించాలనే వ్యూహంతో బీఆర్ఎస్..

శాసనసభ ఎన్నికల్లో ఓటమిపాలైన బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు సాధించాలనే వ్యూహంతో ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రాంతాల్లో మహబూబాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని నాలుగు జిల్లాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఇదే ఊపుతో 2014లో ఆ పార్టీ అభ్యర్థి, కాకతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సీతారాంనాయక్, 2018లో మాజీ ఎమ్మెల్యే మాలోత్ కవితలు ఎంపీగా గెలిచారు. అయితే ఇటీవల జరిగిన పరిణామాలు, పార్టీ బలహీన పడిన నేపథ్యంలో మళ్లీ పార్టీని పట్టాలపైకి ఎక్కించేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇటీవల ఆ పార్టీ అధినాయకత్వం ఎంపీలతో సమీక్షలు కూడా నిర్వహించారు. అయితే అధికార పార్టీ అభ్యర్థులతో పోటీకి దిగాలంటే ప్రజా బలంతోపాటు, ఆర్థిక బలం కూడా అవసరమని ఆలోచిస్తున్నారు. ఈ పరిస్థితిలో సిట్టింగ్ ఎంపీ కవితనే పోటీలో ఉంచుతారా.. లేదా అభ్యర్థిని మారుస్తారా అనేది కూడా అటు పార్టీలో ఇటు ప్రజల్లో ఉంది. ఆరుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన వారు ఉండగా.. బీఆర్ఎస్ పార్టీ ఎంపీగా గెలవాలంటే కఠోర శ్రమ అవసరం.


మోదీ చరిష్మాతో బీజేపీ

మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో భారతీయ జనతా పార్టీకి పెద్దగా పట్టులేకపోయినా.. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అభ్యర్థులను బరిలో దింపారు. అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలకు ధీటుగా ప్రచారం చేశారు. అయితే అసెంబ్లీ వేరు, పార్లమెంట్ ఎన్నికలు వేరు అన్నట్లుగా బీజేపీ నాయకులు చెబుతున్నారు. రెండు పర్యాయాలు భారత ప్రధానిగా ఉన్న నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధి, తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన చట్టాలే తమ పార్టీకి ఓటు బ్యాంకుగా మారుతాయని కమలనాథులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ అభ్యర్థి హుస్సేన్ నాయక్‌ను గెలిపించాలని కోరుతూ మహబూబాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రధాని మోదీ బహిరంగ సభకు ఏడు నియోజకవర్గాల నుంచి జనాన్ని సమీకరించారు. ఆ సభకు జనం వచ్చిన తీరును చూస్తే నరేంద్ర మోదీ అంటే ఎంత క్రేజీ ఉందో అర్థం అవుతుంది. అయితే ఇదే క్రేజీ ఆయనను ప్రధానిగా గెలిపించేందుకు దోహద పడుతుందని, అసెంబ్లీ ఎన్నికలకు పొంతన లేకుండా పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు పడుతాయనే నమ్మకం వారికుంది. అదే దిశగా ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధమవుతున్నారు.

ఉత్తర ద్వార దర్శనం



వేణుగోపాలస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి క్యూ కట్టిన భక్తులు,



స్వామివారి మూలవిరాట్

- వైభవంగా వైకుంఠ ఏకాదశి

మహబూబాబాద్ రూరల్: 'ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి' పర్వదినాన్ని జిల్లాలో శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, వైకుంఠ వాసుడైన శ్రీమహావిష్ణువు రూపాల్లోని శ్రీసీతారామచంద్ర స్వామి, వేణుగోపాలస్వామి, శ్రీ లక్ష్మీనరసింహస్వామి, స్వయంభూ శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వార్లను భక్తులు ఉత్తరద్వార దర్శనాలతో దర్శించుకున్నారు. ఆయా దేవాలయాల్లో భక్తులు దూపదీప నైవేద్యాలు, పూలు పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఎంవీ.కృష్ణప్రసాద్, గుడి రాధాకృష్ణమూర్తి, ముడుంబై లక్ష్మీనారాయణాచార్యులు, కాయితోజు పరిపూర్ణాచార్యులు, ముడుంబై రామానుజాచార్యులు స్వామివార్లకు పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాద ఆశీర్వచనాలు అందించారు. మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం గ్రామంలో అనంతాద్రి గుట్టపై వెలసియున్న శ్రీ జగన్నాథ వేంకటేశ్వర స్వామివారి సన్నిధి భక్తులతో కిటకిటలాడుతూ కనిపించింది.

రామప్పలో పర్యాటకుల సందడి



రామలింగేశ్వరుడిని దర్శించుకుంటున్న పర్యాటకులు



ఆలయానికి తరలివస్తున్న విద్యార్థులు

వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని చారిత్రక రామప్ప దేవాలయంలో శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు, విద్యార్థులు అధికసంఖ్యలో తరలివచ్చి రామప్ప రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్‌లు పర్యాటకులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. టూరిజం గైడ్ విజయ్‌కుమార్, వెంకటేశ్‌లు ఆలయ విశిష్టత గురించి వివరించారు. రామప్ప శిల్పాల వద్ద ఫొటోలు దిగుతూ పర్యాటకులు ఆనందం వ్యక్తం చేశారు.

జర్మనీ దేశస్తుల రాక

రామప్ప దేవాలయాన్ని జర్మనీ దేశానికి చెందిన అంద్రూస్, సబీనా దంపతులు సందర్శించి రామలింగేశ్వరున్ని దర్శించుకున్నారు. ఆలయ విశిష్టత గురించి గైడ్‌లు వివరించగా రామప్ప టెంపుల్ ఆర్కిటెక్చర్ బాగుందని కొనియాడారు.



రామప్పలో జర్మనీ దేశస్తులు

సేంద్రియ వ్యవసాయ రైతులుగా పేరొందాలి

- కలెక్టర్ శశాంక
- ఘనంగా రైతు దినోత్సవం

మహబూబాబాద్ రూరల్: రైతులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని భూసారాన్ని పరిరక్షించే సేంద్రియ వ్యవసాయ రైతులుగా పేరొందాలని కలెక్టర్ శశాంక కోరారు. రైతు సహాయ వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్స్ ఆవరణలో శనివారం రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వ్యవసాయాన్ని పండుగలా చేపట్టాలని కోరుతూ ఆత్మవిశ్వాసంతో అధిక దిగుబడులు సాధిస్తూ స్థిర ఆదాయం పొందాలన్నారు. ఎరువుల వినియోగంతో జిల్లా ప్రథమ స్థానంలో ఉన్నప్పటికీ మిర్చి పంటకు అధికంగా మందులు వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆదర్శ రైతు జైపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతాంగం కోసం పోరాడిన దివంగత స్వర్గీయ మాజీ ప్రధాని చరణ్ సింగ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని 2001 నుంచి రైతు దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పలువురి రైతులను సన్మానించి రైతుల కోసం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ తిలకించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవిరెడ్డి, నరేంద్ర స్వరూప్, పద్మనాభరావు, కృష్ణారెడ్డి, జయశ్రీ, హరీష్, మోహన్, కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన సైంటిస్ట్ మాలతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సూర్యనారాయణ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సుధాకర్, రైతులు పాల్గొన్నారు.



రైతును సన్మానిస్తున్న కలెక్టర్, ఆదర్శ రైతు

ఆటపాటల్లోనూ రాణించాలి

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లోనూ రాణించాలని కలెక్టర్ శశాంక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన ఉత్సవాలకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యువత ఇష్టపడి విద్యను అభ్యసించాలని, కళాశాల నుంచే లక్ష్యం వైపు అడుగులు వేయాలన్నారు. రాష్ట్రస్థాయిలో రాణించి మానుకోటకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. అనంతరం యువజన ఉత్సవాలలో పాల్గొన్న అధికారులకు మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సదానందం, జిల్లా పౌర సంబంధాల అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అలర్ట్.. అలర్ట్..

- కరోనా కొత్త వేరియంట్‌తో కలవరం
- అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ
- ప్రభుత్వ ఆస్పత్రిలో కోవిడ్ ప్రత్యేక వార్డు ఏర్పాటు

నెహ్రూసెంటర్: కరోనా మహమ్మారి మరోకొత్త వేరియంట్ రూపంలో ప్రబలుతుండడంతో ప్రజల్లో భయాందోళనలు మొదలయ్యాయి. ఇతర రాష్ట్రాలతో పాటు తెలంగాణలో కొత్త వేరియంట్ జేఎన్-1 కరోనా కేసులు నమోదవుతుండడంతో వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రత్యేక కోవిడ్ వార్డు ఏర్పాటు చేసి కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వ ఆస్పత్రితో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్‌సీ కేంద్రాల్లో కరోనా ర్యాపిడ్ టెస్టులు చేసేలా ఏర్పాట్లు చేస్తూ సిబ్బంది అలర్ట్‌గా ఉన్నారు.

కొత్త వేరియంట్ కలవరం..

రెండేళ్లుగా కరోనా కారణంగా మరణాలు సంభవించగా వేలల్లో కోవిడ్ భారిన పడి ఆస్పత్రి పాలయ్యారు. కోవిడ్ ముప్పు తప్పిందనుకుంటే కొత్త వేరియంట్ రూపంలో ప్రజల్లో భయాందోళన మొదలైంది. ఇప్పటికే శీతాకాలంతో ప్రజల్లో జలుబు, దగ్గు సాధారణంగా ఉంది. కరోనా ప్రబలుతుందని, కేసులు నమోదు అవుతుండడంతో మళ్లీ పరిస్థితి మొదటికే వచ్చాయని ప్రజలు వాపోతున్నారు. దీనికి తోడు క్రిస్మస్, జనవరి ఒకటి, సంక్రాంతి వేడుకలు మొదలవుతుండగా కరోనా వ్యాప్తి జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రతి ఒక్కరు మాస్కులు ధరించి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచించారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కోవిడ్ ప్రత్యేక వార్డు

వైద్యారోగ్యశాఖ సన్నద్ధం..

కరోనా మొదటి, రెండో విడతల్లో ప్రజలకు వైద్య సేవలు అందించిన వైద్యారోగ్యశాఖ, వైద్యులు, సిబ్బంది కొత్త వేరియంట్‌ను ఎదుర్కొనేందకు సిద్ధంగా ఉన్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేక కోవిడ్ వార్డులను ఏర్పాటు చేసి 20 బెడ్లను అందుబాటులో ఉంచారు. దీంతో పాటు ర్యాపిడ్ టెస్టులు, ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చే వారికి అవసరమైన మందులు అందించి వైద్యం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రితో పాటు గార్ల, గూడూరులో ఆక్సిజన్‌తో కూడిన బెడ్లు అందుబాటులో ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్..

కోవిడ్ మహమ్మారిని ఎదుర్కొనేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులతో కమిషనర్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్, రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జెడ్‌చొంగ్తూ, మిషన్ డైరెక్టర్ ఎన్‌హెచ్‌ఎంఆర్‌వీ కర్ణన్ వీడియో కాన్ఫరెన్స్ శనివారం నిర్వహించారు. జిల్లాలో కోవిడ్ ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని, ఎమర్జెన్సీ మెడిసిన్, ఆక్సిజన్ సిలిండర్లు, కిట్స్, టెస్టులు అన్నీ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కొత్త కోవిడ్ వేరియంట్‌పై వైద్యాధికారులకు, ఆశకార్యకర్తలకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ వీసీలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ అంబరీష, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, డీసీహెచ్‌ఓ డాక్టర్ వెంకట్రాములు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మురళీధర్, పీఓ డాక్టర్ బిందుశ్రీ పాల్గొన్నారు.

ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశాం..



కోవిడ్ కొత్త వేరియంట్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశాం. ప్రస్తుతం 20 బెడ్లను అందుబాటులో ఉంచాం. జిల్లాలో కేసులు నమోదు అయితే మరికొన్ని బెడ్లను పెంచి వైద్యసేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.

- డాక్టర్ శ్రీనివాసరావు, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్

అప్రమత్తంగా ఉండాలి..



కరోనా కట్టడికి వైద్యులు సిద్ధంగా ఉండాలి. కేసులు నమోదై ఆస్పత్రికి వస్తే సకాలంలో వైద్య చికిత్స అందించాలి. వైద్యులకు, సిబ్బందికి కరోనాపై జూమ్ మీటింగ్ నిర్వహించి అప్రమత్తం చేశాం. అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు ఆందోళన చెందవద్దు, అప్రమత్తంగా ఉంటూ మాస్కులు ధరించాలి.

- డాక్టర్ అంబరీష, డీఎంహెచ్‌ఓ

నేలల ప్రాముఖ్యతను గుర్తించాలి

మహబూబాబాద్ రూరల్: యువరైతులు వ్యవసాయ సాగు సమయంలో నేలల ప్రాముఖ్యత, భూసారం పెంచుకునే దిశగా కృషి చేయాలని మల్యాల కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మాలతి అన్నారు. మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో ఆరు రోజులుగా నిర్వహించిన మట్టి పరీక్షలు, మట్టి నమూనా సేకరణ, సమగ్ర ఎరువుల యాజమాన్యంపై గ్రామీణ యువ రైతుల శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా రైతు దినోత్సవం జరిపి రైతులను సన్మానించి శిక్షణ పూర్తి చేసుకున్న రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మల్యాల కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మాలతి మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యంలో జాగ్రత్తలు తీసుకుని జీవన ఎరువుల వాడకాన్ని వ్యవసాయంలో పెంచాలన్నారు. పంటల ఎరువుల అవశేషాలను నేలలో కలియదున్నడం ద్వారా కర్బన శాతం నెలలో పెరుగుతుందన్నారు. రైతులకు మట్టి నమూనా సేకరణ, మట్టి పరీక్షలు ఎలా చేయించుకోవాలి, ఎన్ని సంవత్సరాలకు ఒకసారి చేయించాలో తెలియజేశారు. నీటి పరీక్ష, నీటిలో లవణాలు, సమస్యాత్మక భూముల గురించి వివరించారు. రాబోయే రోజుల్లో యువకులు నేల ఆరోగ్యం, భూసార పరిరక్షణ, ఎరువుల యాజమాన్యంపై పూర్తి అవగాహన సంపాదించుకుని భావితరాలకు భూసారం కలిగిన నేలలను అందించే దిశగా ఎదగాలని సూచించారు. వరంగల్ ఆర్ఏఆర్ఎస్ హెడ్ డాక్టర్ ఆర్.ఉమారెడ్డి ఆన్‌లైన్ ద్వారా రైతులతో మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి లక్ష్మీనారాయణ, శాస్త్రవేత్తలు క్రాంతికుమార్, డాక్టర్ కిశోర్ కుమార్, డాక్టర్ రాంబాబు, యువ రైతులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న మాలతి, లక్ష్మీనారాయణ

మా భూమి కబ్జా చేశారు..

- సీఎం ప్రజాదర్బార్‌లో బాధితురాలు శశిరేఖ వినతి



బాధితురాలు శశిరేఖ

నెల్లికుదురు: అధికార దాహంతో అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ ముఖ్య అనుచరుడైన జెడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాసరెడ్డి మా భూమిని కబ్జా చేసినట్లు బాధితురాలు కూరపాటి శశిరేఖ మాట్లాడుతున్న వీడియో సోషల్ మీడియాలో శనివారం చక్కర్లు కొడుతుంది. మండలంలోని ఆలేరు గ్రామ క్రాస్‌రోడ్ ప్రధాన రహదారి పక్కన ఉన్న పట్టా భూమిని అదే గ్రామానికి చెందిన జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి అక్రమంగా మాపై దౌర్జన్యం చేసి ఆక్రమించుకుని అధికారులతో కుమ్మక్కై పట్టా చేసుకుని షెటర్లు నిర్మించారని ఆరోపిస్తూ తెలిపారు. ఈ భారంతోనే నా భర్త మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేసింది. మా భూమి మాకు ఇప్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజా దర్బార్‌లో వినతిపత్రం అందించినట్లు తెలిపారు. కాగా ఈ విషయమై జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా మా పట్టా భూమిలో బాధితురాలు బండికొట్టు పెట్టుకుని జీవించి ఇప్పుడు మా పట్టా భూమినే తనదని అంటుందని, భూమికి సంబంధించిన పత్రాలు మా వద్దే ఉన్నాయని, కావాలని రాద్ధాంతం చేస్తుందని, ఇది కరెక్టు కాదన్నారు.

ఆర్థిక సంస్కరణల అమలుకు పీవీ కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: ఆర్థిక సంస్కరణలు అమలుపరచి విదేశీ కరెన్సీ భారతదేశానికి రావడంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కీలక పాత్ర పోషించారని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. భారత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు 19వ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పీవీ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. పీవీ ఆశయాలను ముందుకు తీసుకుపోవాల్సిన బాధ్యత తెలంగాణ రాజకీయ నాయకులు, యువతపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఆర్డినేటర్ గుగులోతు వెంకట్ నాయక్, అర్బన్ ఓబీసీ అధ్యక్షుడు లింగాల వీరభద్రం గౌడ్, ఓబీసీ రాష్ట్ర కో కోఆర్డినేటర్ పింద్రాల రాందాస్, ఆరేంద్ర వెంకటేశ్వర్లు చారి, చెన్న సీతారాములు, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామరాజు శంతన్, సల్వాది దిలీప్, తేజావత్ శంకర్ నాయక్, వార్డు కౌన్సిలర్లు బుజ్జి వెంకన్న, హరినాయక్, గుగులోతు రాములునాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

గూడూరు: శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని డీఎస్పీ టి. సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను శనివారం డీఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన వివిధ రకాల రికార్డ్స్, రిజిస్టర్లను పరిశీలించారు. మండల విస్తీర్ణత, గ్రామపంచాయతీలు, ఎక్కువగా కేసులు అయ్యే గ్రామాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణ మీద చేపట్టాల్సిన చర్యలపై తగు సూచనలు ఇచ్చారు. అనంతరం ఫ్రెండ్లీ పోలీస్‌గా గ్రామాల్లో కలిసిపోవాలని, చట్టపరంగా అన్యాయం జరిగిన వారికి న్యాయం జరిగేలా, తప్పిదాలకు పాల్పడిన వారికి అవసరమైన గుణపాఠం చెప్పాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రతిఒక్కరి సమస్యను అడిగి తెలుసుకొని సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఫణిధర్, ఎస్సై రాణాప్రతాప్ పాల్గొన్నారు.



సామగ్రిని పరిశీలిస్తున్న డీఎస్పీ

దీప కాంతుల్లో సీఎస్ఐ చర్చి

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని దక్షిణ ఇండియా సంఘం డోర్నకల్ అధ్యక్ష మండల పరిధిలోని మహబూబాబాద్ పట్టణంలో గల పరిశుద్ధ పౌలు దేవాలయం (సీఎస్ఐ చర్చి)ను శనివారం రాత్రి రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

–మహబూబాబాద్ రూరల్



క్లుప్తంగా

ఛత్తీస్‌గఢ్‌ గవర్నర్‌ను కలిసిన యశ్వంత్‌


గవర్నర్‌కు ఆల్బమ్‌ అందజేస్తున్న యశ్వంత్‌


మరిపెడ రూరల్‌: మహబూబాబాద్‌ జిల్లా మరిపెడ మండలం భూక్యతండాకు చెందిన మౌంటెయినర్‌ భూక్యా యశ్వంత్‌ శనివారం ఛత్తీస్‌గఢ్‌ గవర్నర్‌ బిశ్వభూషణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల ఆస్ట్రేలియాలోని ఎత్తైన కోజిస్కోన్‌ పర్వతాన్ని అధిరోహించి శిఖరంపై భారతదేశ పతాకం ఎగరవేసినట్లు గవర్నర్‌కు వివరించారు. అలాగే, త్వరలో ప్రపంచంలోనే ఎత్తైన ఎవరెస్ట్‌ శిఖరాన్ని అధిరోహించనున్నట్లు గవర్నర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్‌ బిశ్వభూషణ్‌.. యశ్వంత్‌ను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని ఆకాంక్షించారు.

ఉచ్చులో పడి విద్యుత్‌ ఉద్యోగులకు గాయాలు


చికిత్స పొందుతున్న లైన్‌మెన్‌

ఏటూరునాగారం: వన్యప్రాణుల కోసం వేటగాళ్లు అమర్చిన ఉచ్చులో పడి విద్యుత్‌ ఉద్యోగులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఏటూరునాగారం మండలం ముళ్లకట్ట వద్ద చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి ముళ్లకట్ట వద్ద బ్రేక్‌డౌన్‌ (విద్యుత్‌ తీగ తెగడం) అయింది. దీనిపై సమాచారం అందుకున్న కన్నాయిగూడెం లైన్‌మెన్‌ పల్లెబోయిన రవి, వెంకటాపురం(కె) జేఎల్‌ఎం దిలీప్‌ ఘటనాస్థలికి చేరుకున్నారు. అయితే అప్పటికే అక్కడ వన్యప్రాణుల కోసం వేటగాళ్లు విద్యుత్‌ తీగలకు ఉచ్చు అమర్చారు. ఇది గమనించని విద్యుత్‌ సిబ్బంది ఉచ్చులో పడడంతో విద్యుత్‌ షాక్‌ తగిలింది. దీంతో వారికి తీవ్రగాయాలు కావడంతో సిబ్బంది ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించినట్లు విద్యుత్‌శాఖ ఏటూరునాగారం ఏఈ అశోక్‌ తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ పేర్కొన్నారు.

పాకాల సోయగం..



వరంగల్‌ జిల్లా నర్సంపేట సమీపంలోని కొత్తగుడెం రహదారిలో రమణీయ నీటి సరస్సు పాకాల. ఇక్కడ పచ్చని చెట్లు, పూల మొక్కలు, చల్లటి నీడలో పర్యాటకులు సేదదీరుతుంటారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చిల్డ్రన్స్‌ పార్క్‌ మరింత ఆహ్లాదంగా కనిపిస్తుంది. సువిశాల సరస్సులో బోటు షికారు చేస్తూ ప్రకృతిని ఆస్వాదించొచ్చు. మరికొంత మంది తూము వద్ద స్నానాలు చేస్తూ సందడి చేస్తుంటారు.

లక్నవరం అందాలు..



ములుగు జిల్లా చల్వాయిలోని గుట్టల మధ్య సువిశాల లక్నవరం నీటి సరస్సు ఉంటుంది. ఇక్కడ అలలు సముద్రాన్ని తలపించేలా ఎగిసిపడుతుంటాయి. సరస్సు మధ్య దీవులు ఉన్నాయి. ఈ దీవులకు వెళ్లేందుకు పర్యాటక శాఖ తీగల వంతన ఏర్పాటు చేసింది. దీంతో పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో చేరుకుని రోజంత వీక్షించి ఆహ్లాదంగా గడిపి వెనుదిరుగుతుంటారు.

వరుస సెలవులు.. చూసొద్దాం రండి..

ఆధ్యాత్మిక, ఆహ్లాదకరంగా విలసిల్లుతున్న ఉమ్మడి వరంగల్‌ జిల్లా

స్వాగతిస్తున్న లక్నవరం ప్రకృతి అందాలు..

- సజీవ సాక్ష్యంగా కాకతీయ కట్టడాలు
- పిల్లలకు ఆహ్లాదంతోపాటు చారిత్రక విశేషాలు తెలుసుకునే అవకాశం

తరగతి గదుల్లో పుస్తకాలతో నిత్యం కుస్తీ పట్టే విద్యార్థులకు సెలవులు వచ్చాయంటే ఎగిరి గంతేస్తారు. అయితే నిర్దిష్ట లక్ష్యాలతో చదువుతున్న విద్యార్థులకు కాస్తా మానసిక ఉల్లాసం లభించాలంటే కొత్త పర్యాటక ప్రాంతాలు సందర్శించాల్సిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విద్యాసంస్థలకు ఆది, సోమ, మంగళవారం వరుసగా మూడు రోజులు క్రిస్మస్‌ సెలవులు ప్రకటించింది. దీంతో విద్యార్థులు అమ్మమ్మగారింటికి, పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాతిక ప్రదేశాలకు బయలుదేరుతున్నారు. ఈ పర్యటనతో వారిలో ఆహ్లాదంతోపాటు పలు చారిత్రక విశేషాలు తెలుసుకునే అవకాశం ఉంది. కాగా, ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో ప్రధానంగా వరంగల్‌ కోట, పాకాల, రామప్ప, లక్నవరం, మేడారం, మంగపేటలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, పాండవుల గుట్టలు, కోటగుళ్లు, ఐనవోలు మల్లికార్జునస్వామివారి ఆలయం, కొమురెల్లి, కురవి వీరభద్రస్వామి ఆలయం, చిల్పూరు గుట్ట, పాలకుర్తి సోమేశ్వరాలయం, జైనమందిరం, తదితర పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. ఇతర జిల్లాలోని వేములవాడ, యాదగిరి గుట్ట, హైదరాబాద్‌లోని బిర్లా టెంపుల్‌, వండర్‌ లా, సమతామూర్తి ఆశ్రమం, రామోజీ ఫిలిం సిటీ, తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా పర్యాటక ప్రాంతాలు, వాటి విశిష్టత, తదితర వివరాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం. –ఖిలా వరంగల్‌


ఏకశిల గుట్ట

పర్యాటక కేంద్రంగా ఓరుగల్లు

కాకతీయుల రాజధాని ఖిలావరంగల్‌ కోట ప్రపంచ పర్యాటక కేంద్రంగా విలసిల్లుతోంది. పిచుకల కీచుకీచులు.. కోకిల రాగాల మధ్య కోట.. పర్యాటకులను స్వాగతిస్తోంది. కాకతీయులు శకం ముగిసి 800 ఏళ్లు పూర్తయినా నేటికీ కోట చారిత్రక కట్టడాలు కళ్ల ముందు కదలాడుతున్నాయి. నాలుగు కీర్తి తోరణాల మధ్య స్వయంభూశంభులింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం చరిత్రకు నిలువెత్తు సాక్షిగా నిలుస్తోంది. నల్ల రాతిలో నాటి శిల్పులు చెక్కిన అద్భుత కళా ఖండాలు, కళా సంపద దర్శనమిస్తుంది. నాటి ఆనవాళ్లు నేటికీ సజీవంగా నిలిచి ఉన్నాయి. తొలుత సందర్శకులకు రాతి, మట్టికోటలు దర్శన మిస్తాయి. కోటలో ప్రవేశించగానే శిల్పాలకు ఇరువైపులా పచ్చని పంటపొలాలు, వివిధ ఆకుకూరల తోటలు, మొక్క జొన్న, బంతి తోటలు పర్యాటకులను స్వాగతిస్తాయి. ఖుష్‌మహల్‌, ఏకశిలా గుట్టపై నుంచి చూస్తే త్రీనగరం పూర్తిగా కళ్లముందు కదలాడుతుంది. దీనికి తోడు ఏకశిలా చిల్డ్రన్‌ పార్క్‌, గుండు చెరువులో బోటింగ్‌ సౌకర్యాలు, ఏకశిలా గుట్ట పలువురి మనసులు దోచుకుంటోంది.


మధ్యకోటలో శిల్పాల ప్రాంగణం

రమణీయం.. రామప్ప ఆలయం.



కాకతీయుల పాలనలో రామప్ప గుడి నిర్మాణం జరిగింది. నాటి శిల్పులు నల్ల రాతిలో చెక్కిన అద్భుత కళారూపాలు, శిల్ప సౌందర్యం చూపరులను ఆకట్టుకుంటుంది. శిల్ప కళా రూపాల్లోనించి సప్తస్వరాలు పలికించే కళాఖండాలను చేతులతో తడుముతూ సంపదును వీక్షిస్తుంటారు. శిల్పాల్లో భారీ నందీశ్వరుడి విగ్రహం ప్రతిష్ఠించారు. శివుడి ఆజ్ఞ కోసం ఎదురుచూస్తున్నట్లు నందీశ్వరుడు దర్శనమిస్తాడు. ఈ విగ్రహం ఎటు నుంచి చూసిన మనవైపే చూస్తున్నట్లు కనిపిస్తుండడం విశేషం. నందీశ్వరుడి తల, చేతి గోరు తడిమితే తోక వద్ద స్వష్ట స్వరాలు వినిపిస్తాయి.

హైదరాబాద్‌ టూర్‌ ప్లాన్‌ చేశాం



బంధువులతో కలిసి ముందుగానే హైదరాబాద్‌ టూర్‌ ఫిక్స్‌ చేశాం. పిల్లలకు ఆది, సోమ, మంగళవారం మూడురోజులు సెలువురావడంతో కారులోనే హైదరాబాద్‌ వెళ్తున్నాం. హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో నిర్మించిన సమతామూర్తి ఆశ్రమాన్ని దర్శించుకుంటాం. అక్కడి నుంచి రామోజీ ఫిలిం సిటీ వెళ్తాం. తిరుగు ప్రయాణంలో యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి వారిని దర్శించుకుంటాం.

మునుగోటి శ్రీలత, వరంగల్‌

భద్రాచలం వెళ్తున్నాం



మానసిక ప్రశాంతత కోసం కుటుంబ సమేతంగా భద్రాచలం వెళ్తున్నాం. ధనుర్మాసంలో సీతారామచంద్రస్వామి దర్శించుకుంటే పుణ్యం. పాఠశాలకు మూడు రోజుల సెలువులు రావడంతో పిల్లలు, బంధువులతో కలిసి భద్రాచలం వెళ్తున్నాం. తరువాత బోటులో పాపికొండలకు వెళ్తాం. తిరుగు ప్రయాణంలో కిన్నెరసాని డ్యామ్‌, సరస్సు చూస్తాం.

ముద్దసాని సత్యనారాయణరెడ్డి, వరంగల్‌

యేసయ్య స్మరణలో..

- గ్రామాల్లో క్రిస్మస్‌ సందడి
- ముస్తాబైన చర్చిలు
- నేటి రాత్రి నుంచి ఆరాధనలు ప్రారంభం

చెన్నారావుపేట : యేసు క్రీస్తు జన్మదిన వేడుకలకు జిల్లాలోని పలు చర్చిలు ముస్తాబయ్యాయి. విద్యుత్‌ దీపాలు, క్రిస్మస్‌ స్టార్‌లు, ట్రీలు కనువిందు చేస్తున్నాయి. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంటోంది. కాగా, వరంగల్‌ జిల్లాలోని అతిపెద్ద చర్చి అయిన చెన్నారావుపేట మండలం తిమ్మరాయిని పహాడ్‌ చర్చికి భక్తులు పొటెత్తుతారు. సుమారు 1500 పైగా భక్తులు హాజరవుతారు.

నవంబర్‌ 25 నుంచే క్రిస్మస్‌ వేడుకలు

నవంబర్‌ 25 నుంచి ఆగమన కాల ప్రకారం క్రైస్తవులు పూజాబలి కార్యక్రమాలు నిర్వహిస్తారు. నెల రోజులు నిర్వహించే ఈ కార్యక్రమాల ద్వారా వూనవుడు వ్యక్తిగత జీవితంలో చేసిన లోటుపాట్లును సవరించుకోవడం, నూతన వ్యక్తిత్వం పెంపొందించుకోవడానికి ప్రార్థనలు చేస్తారు. అంతే కాకుండా ఇంటింటికి వెళ్తూ క్రిస్మస్‌ శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వాదాలు అందిస్తారు. క్రిస్మస్‌ తాత వేషధారణతో పేదలకు బహుమతులు అందిస్తారు.


క్రిస్మస్‌ వేడుకలకు సిద్ధమైన తిమ్మరాయినిపహాడ్‌ చర్చి

ప్రపంచ శాంతికి ప్రత్యేక ప్రార్థనలు



యేసుక్రీస్తు.. సర్వమానవాళికి ప్రేమ, దయ, జాలి, కరుణ, సమాదానం ఇవ్వడానికే జన్మించారు. క్రీస్తు పుట్టిన రోజు వేడుకలు ప్రతీ సంవత్సరం డిసెంబర్‌ 25న ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా జరుగుతాయి. ఈ సందర్భంగా చర్చిలను సుందరంగా అలంకరిస్తారు. ఈనెల 24న అర్ధరాత్రి నుంచి శాంతి సందేశం అందిస్తారు. ప్రపంచ శాంతి, మానవాళి రక్షణకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

తుమ్మ యాగారెడ్డి, విచారణ గురువు

గంటకు ఘన చరిత్ర..

- సెంటినరీబాప్టిస్ట్‌ చర్చిలో వందేళ్లకు పైబడిన బెల్‌

హన్మకొండ కల్చరల్‌ : హనుమకొండలోని సెంటినరీబాప్టిస్ట్‌ చర్చిలో ఉన్న బెల్‌ (గంట)కు వంద సంవత్సరాలకు పైబడిన ఘనచరిత్ర ఉంది. స్వాతంత్య్ర ఉద్యమ చైతన్యంతో అమెరికాలో ఎంతో శాస్త్రసాంకేతిక, పారిశ్రామిక అభివృద్ధి జరిగింది. పారిశ్రామిక చైతన్యం పెంపొందించిన వారిలో బెంజిమెన్‌ హంక్స్‌ ఒకరు. ఇతడు అమెరికా సైన్యంలో డ్రమ్మర్‌గా విధులు నిర్వర్తించేవాడు. అలాగే, లిచ్‌ఫీల్డ్‌లో మొదట తన కర్మాగారం ప్రారంభించి చర్చి బెల్స్‌ తయారు చేశాడు. తరువాత తన కుమారుడు జ్యూలియస్‌హంక్స్‌తో కలిసి మ్యాన్స్‌ఫీల్డ్‌, వెస్ట్‌ రాయ్‌లలో పెద్ద కర్మాగారాలు స్థాపించాడు. ఇక్కడ అప్రంటీస్‌గా చేరిన అండ్రిమేనేలీ.. బెంజిమెన్‌హంక్స్‌ మనవరాలిని పెళ్లి చేసుకుని ఆ తరువాత న్యూయార్క్‌లోని గిబ్బన్స్‌విల్లేలో తన సొంత కర్మాగారం ఏర్పాటు చేశాడు. తరువాత అండ్రిమేనేలీ మూడో కుమారుడు 1870లో పాయిల్‌ నది ఒడ్డున మేనేలీ బెల్‌ కంపెనీని స్థాపించాడు. ఈ బెల్‌ కంపెనీ 1952 వరకు పని చేసింది. 1883లో వీరు ఎక్కువ సంఖ్యలో బెల్స్‌ను తయారుచేశారు. ఆ విధంగా తయారైన బెల్‌ను 1983లో వరంగల్‌కు తీసుకొచ్చి హనుమకొండ సెంటినరీబాప్టిస్ట్‌ చర్చిలో ఏర్పాటు చేశారు. కాగా, ఇక్కడ ఏర్పాటు చేసిన చర్చి బెల్‌ను మేనేలీ అండ్‌ కంపెనీ తయారు చేసింది.


హన్మకొండ సెంటినరీబాప్టిస్ట్‌ చర్చిలో ఏర్పాటు చేసిన బెల్‌

122 ఏళ్లుగా క్రీస్తు సేవలో..

- చరిత్రకు సజీవ సాక్ష్యం జనగామ ఉంద్రుపుర చర్చి

జనగామ: జనగామ ఉంద్రుపుర సెంటనరీ బాపిస్టు చర్చి 122 ఏళ్లుగా యేసుక్రీస్తు సేవలో తరిస్తోంది. 1901లో స్థాపించిన ఈ చర్చి.. అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ జిల్లాలో తల్లిసంఘం చర్చిగా విలసిల్లుతోంది. రష్యా చెందిన దంపతులు అన్న ఉన్రు(భార్య), హెర్నీ ఉన్రు(భర్త) అనేక దేశాలు పర్యటిస్తూ, జనగామకు చేరుకున్నారు. 1901 నుంచి 1975లో ప్రెస్టన్‌ ఇన్‌స్టిట్యూట్‌ నుంచి చర్చి సేవలు, ప్రార్థనలు కొనసాగించగా, ఆ తర్వాత ఆర్టీసీ బస్టాండ్‌ ఎదురుగా (ప్రస్తుతం) మార్చారు. 1912లో హెర్నీఉన్రు మృతి చెందగా, అన్న ఉన్రు 1921లో రష్యాలో మృతి చెందారు. ఉన్రు పెద్ద కూతురు తండ్రితోనే జనగామలో ఉంటూ సేవకార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె కూడా మృతి చెందడంతో ప్రెస్టన్‌లోని తండ్రి సమాధి పక్కనే ఖననం చేశారు.


ఉంద్రుపుర చర్చి

2002లో నూతన చర్చి ప్రారంభం

2000 సంవత్సరంలో నూతన భవన నిర్మాణం కోసం భూమిపూజ చేసి, 2002లో చర్చిని ప్రారంభించారు. 2005లో అప్పటి ముఖ్యమంత్రి, మహానేత దివంగత వైఎస్‌ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ఉంద్రుపుర సెంటనరీ బాపిస్టు చర్చిని ప్రారంభించారు. ప్రస్తుతం డాక్టర్‌ పాలమాకుల పిలిప్‌ పాస్టర్‌గా సేవలందిస్తున్నారు.

40 అడుగుల క్రిస్మస్‌ ట్రీ, ఇటలీ పశువుల పాక

- శోభాయమానంగా కరుణాపురం చర్చి

ధర్మసాగర్‌/కాజీపేట రూరల్‌: ధర్మసాగర్‌ మండలం కరుణాపురంలో అపురూప కట్టడంగా పేరుగాంచిన క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరం క్రిస్మస్‌ పండుగకు ముస్తాబైంది. చర్చి వ్యవస్థాపకులు, అంతర్జాతీయ దైవజనులు రెవరెండ్‌ డాక్టర్‌ సంగాల పాలస్‌రాజ్‌, గోపు జయప్రకాష్‌ ఆధ్వర్యంలో క్రిస్మస్‌ పండుగ ఏర్పాట్లు చేస్తున్నారు. రంగు రంగుల విద్యుత్‌ కాంతులతో చర్చిని అలంకరించారు. ఇప్పటికే చర్చిని తిలకించేందుకు దేశ నలుమూలల నుంచి అనేకమంది సందర్శకులు వస్తున్నారు. ఇజ్రాయల్‌ దేశంనుంచి తెచ్చిన 1600, 600, 100 ఏళ్ల నాటి ఒలీవ చెట్లు ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. ఈ సందర్భంగా పాల్సన్‌రాజ్‌, జయప్రకాష్‌ మాట్లాడుతూ చర్చి నిర్మాణం తర్వాత మొదటి సారి జరిగే క్రిస్మస్‌ పండుగను పురస్కరించుకుని 24వ తేదీ రాత్రి క్యాండిలైట్‌ సర్వీస్‌, 25న క్రిస్మస్‌ పండుగ రోజు ఊరేగింపు, ప్రత్యేక క్రిస్మస్‌ గీతాలు ఉంటాయని తెలిపారు. ప్రాంగణంలో 40 ఫీట్లతో క్రిస్మస్‌ ట్రీ, ఇటలీనుంచి తెచ్చిన సెట్టుతో పశువుల పాకను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పండుగ రోజు 20 వేల మందికి భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పశువుల పాక

రైతులకు న్యాయం చేయాలి

- తెలంగాణ రైతు సంఘం సలహాదారుడు వెంకటనారాయణ


మాట్లాడుతున్న వెంకట నారాయణ

హన్మకొండ: సన్న, చిన్నకారులు, కౌలు రైతులకు కాంగ్రెస్‌ ప్రభుత్వం న్యాయం చేయాలని తెలంగాణ రైతు సంఘం సలహాదారుడు ప్రొఫెసర్‌ కూరపాటి వెంకట నారాయణ అన్నారు. ఈ మేరకు శనివారం హనుమకొండ బాలసముద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పది సంవత్సరాల బీఆర్‌ఎస్‌ పాలనలో రాష్ట్రంలో 8000 మందికి పైగా కౌలు, సన్న, చిన్న కారు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు ద్వారా రూ.65 వేల కోట్లు పంపిణీ చేసినప్పటికీ... ఇందులో రూ.40 వేల కోట్లు సొమ్ము భూస్వాములు, కార్పొరేట్‌ సంస్థల యజమానులు, రాజకీయ నాయకులు, రియల్‌ ఎస్టేట్‌ దిగ్గజాలు, జమీందారులకు మాత్రమే చేరిందని వివరించారు. ఇప్పటికైనా కాంగ్రెస్‌ ప్రభుత్వం చిన్న, సన్న కారు, కౌలు రైతులకు న్యాయం జరిగేలా విధానాలు రూపొందించాలన్నారు. వ్యవసాయ మార్కెట్లలో అవినీతి జరగకుండా నియంత్రించాలన్నారు. అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని, రైతు రుణాలు మాఫీ చేసి చిన్న, సన్నకారు రైతులను రుణ విముక్తులను చేయాలని కోరారు. వివిధ పంటలకు గిట్టుబాటు ధర అందించాలన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వంలో అన్నదాతల ఆత్మహత్యలు ఉండొద్దని, రైతు సంక్షేమం వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సమావేశంలో రైతు నాయకులు సోమిరెడ్డి శ్రీనివాస్‌, వొడెల రాజన్న, సిరుల రవీందర్‌, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఇసుక లారీ

- ఒకరి మృతి..మరొకరికి తీవ్ర గాయాలు


భిక్షపతి(ఫైల్‌)

ములుగు : ములుగు జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి ఇసుకలారీ.. బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం ములుగు మండలం చింతలపల్లికి చెందిన మామిడిపల్లి భిక్షపతి(35), ఎనగందుల నరేష్‌.. బైక్‌పై పోలీస్‌ స్టేషన్‌ ఎదుట రోడ్డు క్రాస్‌ చేస్తున్నారు. ఈ క్రమంలో హనుమకొండ నుంచి ఏటూరునాగారం వైపునకు అతివేగంగా వెళ్తున్న ఇసుక లారీ.. బైక్‌ను ఢీకొంది. దీంతో భిక్షపతి అక్కడికి అక్కడే మృతిచెందారు. నరేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు వెంటనే నరేష్‌ను ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతుడు నరేష్‌ భార్య సుకన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లుఉ ఎస్సై రామకృష్ణ తెలిపారు. కాగా, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

రేణుక అంత్యక్రియలు పూర్తి


రేణుక మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

ఏటూరునాగారం: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పెంచికలపేట వద్ద శుక్రవారం తెల్లవారుజామున కారు, లారీ ఢీకొన్న ఘటనలో మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన మంతెన కాంతయ్య భార్య రేణుక అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య శనివారం పూర్తయ్యాయి. ఎంజీఎంలో శుక్రవారం రాత్రి వరకు ప్రాణాలతోపోరాడిన ఆమె చివరకు తుదిశ్వాస విడిచారు. దీంతో మృతదేహాన్ని ఏటూరునాగారం తరలించి దహన సంస్కారాలు నిర్వహించారు. కాగా, ఈ ఘటనలో కాంతయ్య, అతడి భార్య రేణుక, కుమార్తె రాధిక చందన మృతి చెందారు. దీంతో రేణుక మృతదేహానికి తన సోదరి కుమారుడు తలకొరివి పెట్టారు. మృతదేహం వద్ద బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా, బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మీనర్సింహారావు, కాంగ్రెస్‌ పార్టీ బ్లాక్‌ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, సర్పంచ్‌ ఈసం రామ్మూర్తి, ఇతర నాయకులు మృతురాలి కుటుంబానికి అండగా నిలిచారు. రేణుక దహన సంస్కారాలకు సహకరించారు. నాయకులు రఘు, సునీల్‌, వెంకన్న, రాము, ప్రమోద్‌, ఎల్లయ్య పాల్గొన్నారు.

భర్త హత్య కేసులో భార్య అరెస్టు

మహబూబాబాద్‌ రూరల్‌: కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తను హత్య చేసిన కేసులో భార్య అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని మహబూబాబాద్‌ టౌన్‌ సీఐ వై.సతీష్‌ శనివారం తెలిపారు. మహబూబాబాద్‌ పట్టణంలోని బెస్తబజార్‌లో నివాసం ఉండే ఆటో డ్రైవర్‌ షేక్‌ యూసుఫ్‌ అక్టోబర్‌ 14వ తేదీన మృతి చెందాడు. యూసుఫ్‌ మృతిపై అనుమానం ఉందని మృతుడి సోదరి ఖతీజా పోలీసులకు ఫిర్యాదు చేయగా టౌన్‌ సీఐ వై.సతీష్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో యూసుఫ్‌ మృతికి అతడి భార్య మహబూబీ కారణమని తేలింది. దీంతో మహబూబీని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.